రైస్ ప్లేంట్స్

"పెద్దమ్మగోరూ! పెదమ్మగోరూ! బుగతమ్మ గోరొచ్చీసినారండి!" అంటూ కేక పెట్టింది నారమ్మ.

"బుగతమ్మ గోరూ! బావున్నారా!" అంది ఆప్యాయంగా.

"బాగున్నాను! నువ్వేలా వున్నావు నారమ్మా?" అంది మాధవి.

"నాకేటమ్మా! గుండ్రాయి నాగున్నాను! తవర్ని సూసీశానా దినాలైనాది! తవరు దిగి లోనికి పదండి సామాను నానొట్టుగొత్తా" అంది.

మాధవి టాక్సీ దిగి వెనుక సీట్లో నిద్రపోతున్న కొడుకును మనోని లేపి దింపింది. ఫ్రంట్ సీట్లోంచి మాధవి చిన్నన్న చంద్రం దిగి డిక్కీలో సామాన్లు దింపి లెక్క సరిచూసి టాక్సీ వాడికి డబ్బులిచ్చి పంపించేడు.

ఆ వరకు మాధవి తల్లిదండ్రులు పెద్దన్న సూర్యం. వదినెలు అందరూ బయటకు వచ్చేరు.

పార్వతమ్మ కూతురుకీ, మనవడికీ గుమ్మంలోనే నిల్చోపెట్టి దిష్టితీసేరు.

"ఏరా బావగారు రాలేదా?" అన్నాడు సూర్యం

"ఎల్లుండి వస్తారు అన్నయ్యా! ఈ మూడు రోజులూ ఏవో కాన్ఫరెన్స్ లున్నాయట" అన్నాడు.

వదినెలిద్దరూ ఆడపడుచును ఆప్యాయంగా పలకరించి లోనికి తీసుకొని వెళ్లేరు.

మనూకి అంతా వింతగా వుంది. వీధి వాకిలి ముందు వేసిన పెద్ద పందిరి దానికి కట్టిన మామిడి మండల తోరణాలు చూసి లోనికి వెళ్లబోయి వీధి గుమ్మందగ్గర

ఆగిపోయేడు. ద్వార బంధం అడుగు చెక్క ఎనిమిదంగుళాల ఎత్తు ఆరంగుళాల మందం వుంది. ఆ గుమ్మానికి అంతకు మునుపే పసుపురాసి బొట్లు పెట్టేరు. అవింకా తడారలేదు.

అంత పెద్దగుమ్మం చూడడం అదే మొదటిసారి. దానిని ఎలాదాటాలో వాడికి అర్థంకాక తికమక పడుతున్నాడు.

అంతలో వాడు గాల్లో లేచి గుమ్మం అవతల దింపబడడంతో తిరిగి చూసేడు. వాడిని గుమ్మం దాటించింది చంద్రం.

"చిన్న మావయ్యా! ఇదెందుకు అడ్డుగా పెట్టేరు? దీని పైనుంచి జంప్ చెయ్యాలా?" అన్నాడు.

"అదా? చూడు అక్కడ ఉయ్యాలబల్ల మీద తీరికగా కూర్చున్నారు చూసేవా? మీ తాతగారు. వెళ్లి ఆయన్ని అడుగు!" అన్నాడు చంద్రం నవ్వుతూ. మూడురోజుల

నుండీ మేనల్లుడి ప్రశ్నల పరంపరను ఎదుర్కొంటున్నాడు.

పరమేశ్వరశాస్త్రిగారికి పెద్దలు సంపాదించిన ఆస్తి యాభై ఎకరాల పల్లపు పొలం, నాలుగు ఎకరాల మామిడి, నిమ్మ, బత్తాయి, జామ తోటలు వున్నాయి. గ్రామంలో అయనకు ముందూ వెనకా విశాలమైన ఆవరణ వున్న పాతకాలం పదిగదులున్న మండువా యిల్లు వుంది. ఆ యింటికి అధునాతన సౌకర్యాలన్నీ సమకూర్చేరు. నాలుగు బెడ్‌రూమ్స్‌కు ఎటాచ్‌డ్ బాత్‌రూమ్స్ టాయ్‌లెట్స్ కట్టించేరు.

పరమేశ్వరశాస్త్రి గారికి ఇద్దరు కొడుకులు సూర్యం, చంద్రం. ఒక కూతురు మాధవి. కొడుకులిద్దరూ డిగ్రీ పుచ్చుకొని వ్యవసాయం చూసుకుంటూ తండ్రికి విశ్రాంతి నిచ్చేరు. కొడుకులకు మేనరికాలే చేసేరు. వారికి చెరొక కొడుకూ, కూతురు సంతానం,. మాధవి భర్త హయగ్రీవరావు హైదరాబాద్‌లో బేంక్ మేనేజర్. వారి ఏకైక కుమారుడు మనోజ్. ఐదు సంవత్సరాల వాడు. కాన్వెంట్‌లో సెకెండ్‌క్లాస్ చదువుతున్నాడు. చురుకైనవాడు.

పెద్ద మనవడికి ఉపనయనం చేయ సంకల్పించి కూతురు, అల్లుడు, మనవడ్ని తీసుకొని రమ్మనమని చంద్రాన్ని హైదరాబాద్ పంపించేరు పరమేశ్వరశాస్త్రిగారు.

"తాతగారూ!" అంటూ పరుగుపరుగున వస్తున్న మనవడిని చూసి ఉయ్యాల బల్ల దిగి చేతులు చాచేరు.

"మనూ! షూస్!" అంటూ కొడుకుని మధ్యలోనే ఆపి షూస్ సాక్స్ విప్పింది మాధవి.

"పర్వాలేదమ్మా!" అని మనవడిని ఎత్తుకొని కిస్‌చేసి ఉయ్యాల బల్లమీద కూర్చోబెట్టి తనూ కూర్చున్నారు.

"తాతయ్యా! మరి అక్కడ దార్లో అడ్డంగా ఎందుకు పెట్టేరు? కాలు తగిలి పడిపోరూ?" అన్నాడు.

"ఏది బాబూ? ఎక్కడ?"

"అక్కడ! ముందు డోర్ దగ్గర!" అన్నాడు అటు చేయి చూపించి.

"నారయ్యా చూడు దారిలో ఎదో అడ్డం వుందిట!" అని కేకవేసేరు. అప్పుడే లోనికి వస్తున్న నారయ్య నుద్దేశించి.

నారమ్మ పెనిమిటి నారయ్య వారిద్దరూ, వారి ముగ్గురు కొడుకులు, కోడళ్ళూ అందరూ పరమేశ్వర శాస్త్రిగారింటి పని వ్యవసాయం పనులూ చేస్తున్నారు. వారికి కావల్సినదంతా పరమేశ్వరశాస్త్రిగారిస్తున్నారు. వారిని కూడ కుటుంబ సభ్యులుగానే చూస్తున్నారు.

"ఏడబాబూ! తోవల ఏటీనేదే!" అన్నాడు నారయ్య అటూ యిటూ, ముందూ వెనుకా తిరిగి చూసి.

"ఉంది తాతయ్యా! నేను చూపిస్తాను" అని వాడు ఆయన చేయి పట్టుకొని వీధిగుమ్మం వద్దకు తీసుకొని వెళ్ళి చూపించి

"ఇంత పెద్దది అడ్డంగా వుంటే ఎలా!" అన్నాడు.

కూతురితో ముచ్చటిస్తున్న పార్వతమ్మగారు "అమ్మాయి! అటు చూడు! మనవడు వచ్చీరావడంతోనే వాళ్ళ తాతగారిని ఆటపట్టించేడు" అన్నారు

పరమేశ్వరశాస్త్రిగారికి ఏం సమాధానం చెప్పాలో పాలుపోక "అదీ గుమ్మంరా' అన్నారు నవ్వుతూ.

"చెప్పేవాళ్ళకి ఓపికుండాలి! వాడన్నీ తిక్క ప్రశ్నలు వేస్తాడు. నాన్నగారూ! వాడి సిల్లీ ప్రశ్నలకు వాళ్ళ డాడీయే వాడికి ఓపికగా సమాధానాలు చెప్పగలరు!" అంది మాధవి నవ్వుతూ.

పార్వతమ్మగారు మనవడిని దగ్గరకు తీసుకొని ఒడిలో కూర్చోపెట్టుకొని ముద్దాడేరు.

పెద్దకోడలు కమలరెండు కప్పులతో జున్నుతెచ్చి ఒక కప్పు మాధవికి, ఒక కప్పు మనూకి యిచ్చింది.

"ఐస్‌క్రీమా!?" అన్నాడు సంతోషంగా.

"కాదు బాబూ! యిదీ జున్ను!" అంది కమల.

"జున్ను అంటే?"

"చీజ్!" అంది మాధవి. "అవునూ ఇంత ఉదయాన్నే జున్నెక్కడిది వదినా!" అంది.

"మనింట్లో జర్సీ పడ్డ వుండేది కదూ! అది చూలు కట్టి నిన్న ఉదయం ఈనింది! జున్ను నీ కిష్టమని ఉదయాన్నే చేసినట్లుంది!" అన్నారు పార్వతమ్మగారు.

"ఎలా వుంది?" అని అడిగింది మనవడిని.

"చాల బావుంది అమ్మమ్మా" అన్నాడు.

"బుగతమ్మగోరూ! తవకి ఉడకు నీరు నూతికాడ తానాల గదిల ఎట్టేను" అంది నారమ్మ.

" దా బాబూ! తవకి తానం చేపిత్తా!" అని మనోజ్‌ని పిల్చింది.

"నీ కాళ్ళకి గొలుసులూ, రింగులూ ఎవరు కట్టేరు? నీకు నొప్పిగా లేదా?" అన్నాడు నారమ్మ కాళ్లకున్న వెండిగొలుసులూ, కడియాలు చూసి.

"నాను యీ పొద్దివి నేరక పోయి ఎట్టుగున్నా పెద్దమ్మగోరూ!" అంది నారమ్మ సిగ్గుపడుతూ.

"పోనీవే! వాడికివన్నీ వింతగా వున్నాయి" అన్నారు.

మాధవి లేచి గదిలోకి వెళ్ళి కొడుకు కోసం కుర్తా, పైజమా, బనీను, డ్రాయరూ తీసి బయట ఉంచింది. వాడిపేంటూ, షర్టూ విప్పింది. డ్రాయరు, బనీనుతో వాడు నారమ్మ వెంట పెరట్లోకి వెళ్ళేడు.

వాడి సోపూ, టవలూ మాధవి నారమ్మకిచ్చింది.

పెరట్లో కూడ తాటికమ్మల పందిరి వేసి మామిడాకుల తోరణాలు కట్టేరు. పందిర్రాటకు లేగదూడ కాలుకి తాడుతో కట్టేరు. దూడమూతికి తాళ్లతో అల్లిన నెట్ తగిలించేరు.

మనూని చూసి దూడ వాడి వద్దకు రాబోయింది. అది చూసి వాడు 'కెవ్వ్' మన్నాడు.

"అదేటీ సెయ్యదు బాబూ! సూడండి!" అని వాడిని దాని దగ్గరకు తీసుకొని వెళ్ళింది. వాడు దానిని ముట్టుకుని కాస్సేపు దాని ఒంటిమీద చెయ్యివేసి నిమిరేడు. వాడికి భయం పోయింది.

"దీని పేరేంటి? మూతికి అదెందుకు పెట్టేరు" అన్నాడు.

"దూడ బాబూ! మూతికి అదెట్టకుంటే ముట్టి నాకుతాది"

నూతి చప్టామీదున్న వేడినీళ్ల బకెట్ చూసి

"ఛీ! యిక్కడేంటి స్నానం చేస్తారు! షేమ్! షేమ్!" అన్నాడు. రెండు అడుగులు వెనుకకు వేసి.

"మరెక్కడ చేస్తావ్! బాత్‌రూమ్‌లోనా!" అటుగా వచ్చిన విమల అంది. వాడు అవునని తల వూపేడు..

"మరి యిక్కడ బాత్‌రూమ్‌లో మీ మమ్మీచేస్తోంది! చూడు నారమ్మా! వీళ్ల గదిలో వున్న స్నానాల గదిలో యీ వేడినీళ్ల బాల్చీపెట్టు. అక్కడ చేస్తాడు" అంది నవ్వుతూ.

"అట్టాగేనమ్మా" అని నారమ్మ నీళ్ళ బకెట్, సోపు, టవల్ తీసుకొని వెళ్ళింది. కూడ మనూ వెళ్ళి స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చేడు.

పార్వతమ్మగారు మనవడికి తలదువ్వి ముఖానికి పౌడర్ అద్దేరు.

ఉదయాన్నే ట్యూషన్‌కి వెళ్లిన నలుగురు పిల్లలూ పరుగు పరుగున వచ్చేరు. వాళ్లను చూడగానే మనూ ముఖం వికసించింది.

స్నానం చేసివచ్చిన మాధవిని చూసి పిల్లలు "అత్తయ్యా!" అని చుట్టూ చేరేరు- మాధవి వారికోసం కొని తెచ్చిన రడీ మేడ్ దుస్తులు, రకరకాల గిఫ్ట్‌లు వారికిచ్చింది. వారు దుస్తులు వేసుకుని చూసుకున్నారు. సరిపోయేయి. వారు అవన్నీ వాళ్ల అమ్మకి, తాతగారికి, నాయనమ్మకు చూపించేరు.

"ఇప్పుడు వాళ్ళకి అవన్నీ ఎందుకు కొని తెచ్చావ్ చెల్లాయి" అన్నాడు సూర్యం.

"అమ్మమ్మా! నాకు త్రీడ్రెసెస్! చూడు యిది తాతగారు యిది పెద్ద మామయ్య. ఇది చిన్న మామయ్య యిచ్చినవి" అని సంతోషంగా చూపించేడు. అవి చంద్రం హైదరాబాద్‌లో వాడికి కొని యిచ్చి అలాగని చెప్పేడు.

మధ్యాహ్నం భోజనాలయినప్పటి నుండీ మనూ వాళ్ల చిన్నమామయ్య చంద్రాన్ని పొలాలు పండ్లతోటలూ చూపించమని వేధిస్తున్నాడు.

వాడికి వాటన్నిటి గురించి చంద్రం హైదరాబాద్‌లో చెప్పి అవి చూపిస్తానని

ప్రామిస్ చేసేడు.

సాయంత్రం పిల్లలు స్కూలు నుంచి వచ్చేక వాళ్లను, మనూని తీసుకొని వెళ్ళేడు.

కనుచూపుమేర అందంగా వున్న పచ్చటి వరిపొలాలు మనూ వింతగా చూసేడు.

"ఇవన్నీ ఏం మొక్కలు" అన్నాడు.

"యిదీ వరి చేను"

"వరి అంటే ?"

"పేడీ-రైస్!"

"మనం అన్నం వండుకునే రైస్ ప్లేంట్సా!" అన్నాడు.

"మరి అన్ని ఎందుకు వేసేరు?"

"మనకి కావల్సినన్ని వుంచుకొని మిగిలినవి అమ్మేస్తాం" అన్నాడు చంద్రం.

తోటలో వున్న జామ, బత్తాయి, నిమ్మచెట్లు వాటికి వున్న గుత్తుల గుత్తుల పండ్లు చూసి ఆనందంతో గంతులు వేసేడు మనూ.

నారయ్య పెద్ద కొడుకు కొన్ని పళ్లుకోసి బుట్టలో వేసి వారివెంట యింటికి తెచ్చేడు.

మనూ యింటికి వచ్చి వాడు చూసినవన్నీ వాడి మమ్మీకి చెప్పేడే. వాడు రోజూ లేగదూడతో ఆడుకోవడం లేదా తోటకి తీసుకొని వెళ్లమని గొడవచెయ్యడం చేస్తున్నాడు.

వాడి డాడీ వచ్చేక వాడు చూసినవన్నీ చెప్పేడు. దూడను హైదరాబాద్ తీసుకొని వెళ్దామని గొడవ చేసేడు. వాడికి బలవంతంగానచ్చ చెప్పేరు. అది పెద్దదయ్యాక తీసుకెళ్దామని మరిపించేరు.

మనూ హైదరాబాద్‌లో ఫ్రెండ్స్‌కి దూడసంగతి, పొలాలు పండ్ల తోటల సంగతి చెప్పేడు.

హైబ్రీడ్ పూల మొక్కలు నాటాలని మాధవి నాలుగు మొక్కల గోలేలు,

ఋట్టు తప్పించింది. ఒకదాంట్లో గులాబీ, ఒక దాంట్లో మందార మొక్కలు వేసి రెండు గోలేలు కాళీగా వుంచింది. వాటిలో సీజనల్ ఫ్లవర్స్ వేద్దామని వుంచింది.

మర్నాడు వాటిలో కూడమట్టి వేసి వుండడం చూసింది. అయితే ఆ గోలేలకు విపరీతంగా చీమలు పట్టివున్నాయి. మాధవికి అర్థంకాక భర్తను పిల్చి అడిగింది.

అంతలో మనూ అక్కడికి వచ్చి -

"మమ్మీ! వాటిలో నేను రైస్ ప్లాంట్స్, షుగర్ ప్లాంట్స్ వేసేను! మొక్కలు ఇంకా రాలేదేమిటి?" అన్నాడు.

"రైస్ ప్లాంట్స్, షుగర్ ప్లాంట్స్ ఏవిట్రా!" అన్నారు.

"అదే మమ్మీ! తాతగారికి చాలా రైస్ ప్లాంట్స్ ఉన్నాయిగా! చిన్న మామయ్య నాకు చూపించేడు అవి! నేనుకూడ వీటిలో వేసేను. మరి మనకీ మొక్కలు రైస్, షుగర్ కాస్తాయి కదా! మనం వాటిని ఎంచక్కా రోజూ కోసుకోవచ్చు! అందుకని ఒక దాంట్లో రైస్, ఒకదాంట్లో షుగర్ పోసి మట్టికప్పేను. ఇంకా మొక్కలు రాలేదు" అన్న కొడుకు మాటలకు నిర్ఘాంతపోయేరు భార్యాభర్తలు.

(ఫేకర్ 1965 దీపావళి సంచిక) ✪